సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ၊ 25 ၊ నవంబర్ ၊ 2023



చీనీ టన్ను రూ.27 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.27 వేలు పలికాయి. మార్కెట్‌కు 5 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.22
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
33.8°/21.3°
జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలిక పాటి జల్లులు పడ్డాయి. ఉదయం చలి కొన సాగింది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరుగుతోంది. సోమవారం 78 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మూడు రోజుల్లో కొంతమేర పెరిగింది. అది శుక్రవారం ఇన్‌ఫ్లో 556 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 10,741 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రస్తుతం డ్యాం నీటి మట్టం 1596.85 అడుగులతో 17.722 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీలో 1,790 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా చింతా సుధాకర్



ప్రొఫెసర్ చింతా సుధాకర్

అనంతపురం: శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ చింతా సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలా రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పదవీ కాలం శుక్రవారంతో ముగియడంతో ఇన్‌చార్జ్ వీసీని నియమించారు. చింతా సుధాకర్ ప్రస్తుతం యోగి వేమన యూనివర్సిటీ వీసీగా ఉన్నారు. ఎస్కేయూ పూర్వ విద్యార్థి, మాజీ బోటనీ ప్రొఫెసర్ అయిన చింతా సుధాకర్‌కు 34 సంవత్సరాల విశేషమైన బోధన, 37 సంవత్సరాల పరిశోధనానుభవం ఉంది. ఎమ్మెస్సీ (బోటనీ), పీహెచ్‌డీ ఎస్కేయూలోనే పూర్తి చేశారు. 1987లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎస్కేయూలో చేరారు. ఎస్కేయూలోనే చదివి, ఇక్కడే ప్రొఫెసర్‌గా పనిచేసి తాజాగా ఇన్‌చార్జ్ వీసీగా వస్తున్నారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

చదువుతోనే అసమానతలు దూరం



అభినందన సభలో మాట్లాడుతున్న గుంటూరు డిప్యూటీ కలెక్టర్ స్వాతి

పరిగి: చదువు సంస్కారంతో పాటు విజ్ఞానాన్ని నేర్పుతుందని, సమాజంలోని అసమానతలు తొలగిస్తుందని గుంటూరు డిప్యూటీ కలెక్టర్ స్వాతి తెలిపారు. గ్రూప్స్‌లో 8వ ర్యాంకు సాధించి, గుంటూరు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న స్వాతి తొలిసారి స్వగ్రామమైన గొరవనహళ్లికి వచ్చారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో పర్యటించారు. అనంతరం వినాయక ఆలయం వద్ద ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి ఆమెకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ చిన్నతనం నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్నట్లు తెలిపారు. తన ఎదుగుదలలో తల్లిదండ్రులు, బంధువుల ప్రోత్సాహం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసాన్ని కొనసాగించి, పీజీ తర్వాత ఎస్‌ఐగా ఎంపికైనట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా చదవడం వల్ల అత్యుత్తమ ర్యాంకు వచ్చిందన్నారు. స్వాతి తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులను ఎంఈఎఫ్ ఉద్యోగులు ఏఎస్‌ఐ శ్రీరాములు, విశ్రాంత ఎంఈఓ పెన్నయ్య, టీచర్లు శంకరప్ప, ఓబులేశు, బాబయ్య, మాజీ ఎంపీపీ గోవిందప్ప సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, సెక్రటరీ ప్రభుదాస్, ఎంపీటీసీలు అంజి, హనుమంతు, గ్రామస్తులు సంజీవరాయప్ప, ప్రభు, హనుమంతు, రమేష్, జై భీం పార్టీ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

లేపాక్షి: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వీరభద్ర స్వామి దేవస్థానాల నూతన ధర్మకర్తల మండలి నియామకానికి జిల్లా దేవదాయశాఖ అధికారి కె.మల్లికార్జునరెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎంహెచ్.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు 20 రోజుల్లోపు దరఖాస్తు పూర్తి చేసి జిల్లా దేవదాయశాఖ అధికారికి అందజేయాలన్నారు.

క్షయకు కళ్లెం!



- వ్యాధి కట్టడికి క్షేత్రస్థాయిలో చర్యలు
- రోగుల గుర్తింపునకు జిల్లాలో సర్వే
- లక్షణాలు కనిపిస్తే ఆస్పత్రిలో పరీక్షలు
- నిర్ధారణ అయితే వెంటనే వైద్యసేవలు
- త్వరలోనే జిల్లా వ్యాప్తంగా వ్యాక్సినేషన్

8	జిల్లాలో టీబీ యూనిట్లు
2,190	ఈ ఏడాది నమోదైన రోగుల సంఖ్య
67	డీఆర్‌టీబీ కేసులు
2,110	డీఎస్‌టీబీ కేసులు

సాక్షి, పుట్టపర్తి

ప్రమాదకర క్షయ (టీబీ) వ్యాధి చాప కింద నీరులా వ్యాప్తి చెందుతోంది. రోగి తుమ్మినా.. దగ్గినా.. నోటి తుంపర్ల ద్వారా ఇతరులకూ సోకుతోంది. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణం మీదకు వస్తోంది. ఈ క్రమంలో టీబీ కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బాధితులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. కొద్దిపాటి లక్షణాలున్నా ఆస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేయిస్తోంది. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటోంది. అంతేకాకుండా రోగులు త్వరితగతిన కోలుకునేందుకు పౌష్టికాహారంతో పాటు ఆర్థిక సాయం అందిస్తోంది. క్షయ రహిత జిల్లాగా మార్చే క్రమంలో వ్యాక్సినేషన్ ప్రక్రియకు శ్రీకారం చుడుతోంది.


ఆరు నెలల కోర్సుతో వ్యాధి నయం..

క్షయ ప్రమాదకరమైనప్పటికీ ఆరు నెలల కోర్సు పూర్తి చేస్తే సంపూర్ణంగా నయమవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈక్రమంలో ఇప్పటికే రోగులకు ఆరు నెలల పాటు డాట్ పద్ధతి ద్వారా ఆశా కార్యకర్తల సాయంతో క్రమం తప్పకుండా ఉచితంగా మందులు (ఔషధాలు) అందిస్తున్నారు. ప్రతి నెలా రోగుల ఖాతాలో రూ.500 జమ చేస్తున్నారు. దీనికి తోడు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. ఇలా వ్యాధి పూర్తిగా తగ్గి బాధితులు సంపూర్ణ ఆరోగ్యవంతులయ్యే వరకూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రయోజనం..

క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి క్రమం తప్పకుండా చికిత్స అందజేస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మందుల వాడకంలో నిర్లక్ష్యం వహించినా, అసలు వైద్యమే పొందకపోయినా ప్రాణ నష్టం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు. అలాగే టీబీ సోకిన వారితో ఎక్కువ సేపు గడపకపోవడం, వారితో కరచాలనం చేయకపోవడం మంచిదని సూచిస్తున్నారు. టీబీ రోగులతో కలిసి పబ్లిక్ టాయిలెట్లు వినియోగించడం, ఆహారం పంచుకోవడం కూడా ప్రమాదమేనని చెబుతున్నారు. దగ్గు, తుమ్ముల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

పిల్లలకు, పెద్దలకు వ్యాక్సినేషన్..



క్షయ నివారణకు ప్రభుత్వం చాలా రోజులుగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తోంది. అయితే గతంలో చిన్నారులకు మాత్రమే ఈ టీకా వేసేవారు. ఇటీవల టీబీ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో డిసెంబరు 15 తర్వాత జిల్లా వ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నట్లు వైద్యులు తెలిపారు. గతంలో శిశువులకు మాత్రమే వేసే బీసీజీ టీకాలను ఇక నుంచి పెద్దలకు వేయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

- టీబీ బాధితుడితో సుదీర్ఘ సమయం గడపడం, రద్దీ వాతావరణంలో ఉండటం
- రోగ నిరోధక శక్తిని తగ్గించే మందులు వాడే వారికి
- ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్న వారికి
- హెచ్‌ఐవీ, మధుమేహ బాధితులకు త్వరగా టీబీ సోకే అవకాశం ఉంటుంది.

టీబీ లక్షణాలు ఇవే..

- రెండు వారాలకు మించి దగ్గు
- మందులు వాడినా 15 రోజుల పాటు జ్వరం తగ్గకపోవడం.
- కళ్లలో రక్తం పడటం, బరువు కోల్పోవడం
- ఛాతీ ఎక్స్‌రేలో మార్పు, దగ్గినప్పుడు ఉమ్మిలో రక్తం కనిపించడం

వ్యాక్సినేషన్ ఇలా..

- ఇప్పటికే టీబీ వచ్చి తగ్గిన వారికి
- 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు
- మధుమేహం బాధితులకు
- ధూమపానం చేసేవారికి
- తక్కువ బరువు ఉన్న వారికి
- క్షయ రోగుల కుటుంబ సభ్యులకు బీసీజీ వ్యాక్సిన్ వేయనున్నారు.

క్షయ రహిత జిల్లానే లక్ష్యం

శ్రీసత్యసాయిని క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం. టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. అదే సమయంలో నివారణకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం. రానున్న డిసెంబరు 15వ తేదీ తర్వాత టీకాలు వస్తాయి. అంతలోపే టీకా ఎవరికి వేయాలన్న దానిపై సర్వే చేస్తున్నాం. వంద శాతం టీబీ కేసులు లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నాం.
– తిప్పయ్య, జిల్లా క్షయ నివారణ అధికారి

ఎక్సైజ్‌లో మామూళ్ల గోల

- బార్ల యాజమాన్యాలపై ఒత్తిడి
- ఉమ్మడి జిల్లాలో 36 బార్ల నుంచి నెలకు రూ.16.20 లక్షలు
- సెబ్, గోడౌన్ అధికారులూ ఒత్తిడి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎక్సైజ్ విభాగంలో అధికారులకు, బార్ల యజమానులకు మధ్య 'మామూళ్ల' వివాదం తారస్థాయికి చేరింది. ప్రతినెలా క్రమం తప్పకుండా ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు సొమ్ము ఇవ్వకపోతే ఏదో ఒక రకంగా ఇబ్బంది పెడుతున్నారని బార్ల యజమానులు ఆరోపిస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి రెండు జిల్లాల్లోనూ ఈ వసూళ్ల బాగోతం సాగుతోంది.

నిర్ణయించిన మేరకు ఇవ్వాల్సిందే: ప్రతి బార్ యజమాని 'నిర్ణీత రుసుం' ఇవ్వాల్సిందేనని ఎక్సైజ్ అధికారులు ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ఒక్కో బార్ యజమాని నెలకు రూ.45 వేలు ఈ విభాగానికి ఇవ్వాల్సిందే. లేదంటే నిర్ణయించిన సమయం కంటే ముందు బార్ ఓపెన్ చేశారనో, ఆలస్యంగా బార్ మూస్తున్నారనో దాడులు చేస్తామని బెదిరిస్తున్నట్టు సమాచారం. మరోవైపు అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఓ బార్‌కు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చి.. నిర్వాహకుల నుంచి భారీగా సొమ్ము తీసుకున్నట్టు ఆరోపణలొచ్చాయి. బార్ పక్కనే ఆస్పత్రి, విద్యా సంస్థలు ఉన్నా అనుమతులు ఇచ్చారని తేలింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో 36 వరకూ బార్లు ఉన్నాయి. వీటిలో ఒక్కో బార్‌కు రూ.45 వేల చొప్పున నెలకు అన్ని బార్ల నుంచి రూ.16.20 లక్షలు ఎక్సైజ్ విభాగానికి చేరుతున్నట్టు తెలిసింది. ఒక సీఐ స్థాయి వ్యక్తికి ఈ సొమ్ము చేర్చి పంపకాలు చేస్తున్నారు.

ఒకరిని చూసి మరొకరు : ఓ వైపు ఎక్సైజ్ అధికారులు మామూళ్ల కోసం ఒత్తిడి తెస్తుండగా... మరోవైపు సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు తమకూ మామూళ్లు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. వీళ్లతో పాటు లిక్కర్ గోడౌన్ అధికారులు సైతం 'మామూళ్ల' కోసం డిమాండ్ చేస్తున్నారు. నెలకు ఒక్కో బార్ యజమాని గోడౌన్‌కు రూ.15 వేలు, సెబ్‌కు రూ.15 వేలు ముట్టజెబుతున్నట్లు ఓ బార్ యజమాని చెప్పారు.

ఎక్సైజ్ మామూళ్లు ఇవ్వలేం! : తాజాగా బార్ల యజమానులు సమావేశం నిర్వహించి నవంబర్ నెల నుంచి ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు ఇచ్చేది లేదని తీర్మానించినట్టు తెలిసింది. ఇటీవలే ఎక్సైజ్ అధికారులు ప్రతి నెలా ఇచ్చే రూ.45 వేలు కాకుండా ఎక్కువ మొత్తంలో డిమాండ్ చేశారని, దీంతో తాము ఇవ్వలేమని తీర్మానం చేశామని ఓ బార్ యజమాని 'సాక్షి'తో చెప్పారు. మరి వచ్చే నెల నుంచి మామూళ్ల వ్యవహారం ఎటు దారితీస్తుందో వేచి చూడాలి.

మామూళ్లు అవాస్తవం

బార్ల యాజమాన్యాల నుంచి నెల నెలా మామూళ్ల రూపంలో తమకు డబ్బులు ముడుతున్నాయన్నది అవాస్తవం. మాకు ఎవరూ మామూళ్లు ఇవ్వడం లేదు. బార్ల యాజమాన్యాల వద్దకు వెళ్లి మేము ఎప్పుడూ డబ్బు అడగలేదు.
– మధుసూదన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

పరారీలోనే సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్

- రెండు రోజులైనా ఆచూకీ కనిపెట్టలేని పోలీసులు
- కార్యాలయంలో నిలిచిన రిజిస్ట్రేషన్లు



పరారీకి ముందు బుధవారం రాత్రి కార్యాలయంలో ఉన్న శ్రీనివాస్

పుట్టపర్తి: లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయి సినీ ఫక్కీలో తప్పించుకున్న బుక్కపట్నం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాస్ నాయక్ ఆచూకీ శుక్రవారం నాటికీ లభించలేదు. బుధవారం రైతు సురేందర్‌రెడ్డితో శ్రీనివాస్ నాయక్ రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి శ్రీనివాస్ నాయక్‌ను పట్టుకున్నారు. అదే రోజు రాత్రి వరకూ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలన చేశారు. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారుల కళ్లుగప్పి శ్రీనివాస్ నాయక్ తప్పించుకున్న విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో ఏసీబీ అధికారుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే నేటికీ శ్రీనివాస్ నాయక్ ఆచూకీ మాత్రం తెలియరాలేదు.

ఆగిన రిజిస్ట్రేషన్లు..

మరోవైపు శ్రీనివాస్ నాయక్ ఏసీబీ అధికారులకు దొరికిపోవడం..తదనంతర పరిణామాల నేపథ్యంలో బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా గౌరమ్మను ఉన్నతాధికారులు నియమించినప్పటికీ రెండు రోజులుగా ఎలాంటి లావాదేవీలు జరగలేదు. దీంతో శుక్రవారం కార్యాలయం నిర్మానుష్యంగా కనిపించింది.

క్లెయిమ్‌లన్నీ పక్కాగా పరిష్కరిస్తున్నాం

- సీఈఓకు తెలిపిన కలెక్టర్ అరుణ్‌బాబు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: ప్రత్యేక ఓటరు సవరణలో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వేలో వచ్చిన దరఖాస్తులు, రాజకీయ పార్టీల నుంచి వచ్చి అభ్యంతరాలను పక్కాగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులన్నీ పరిష్కరిస్తున్నామన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి ఓటరు జాబితా సవరణ క్రమంలో వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలు, పరిష్కార తీరుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ చేతన్ పాల్గొన్నారు. జిల్లాలో క్లెయిమ్‌ల పరిశీలన, పరిష్కారం గురించి కలెక్టర్ ఈ సందర్భంగా సీఈఓకు వివరించారు. సవరణ క్రమంలో ఫారం-6,7,8 దరఖాస్తులు ఇప్పటివరకు 20,313 అందగా, వాటిలో 30 రోజుల గడువు దాటినవి 1,203 ఉన్నాయన్నారు. వీటిని త్వరలోనే పరిష్కరించనున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లలో 70 శాతం పరిష్కరించినట్లు వివరించారు. 18 ఏళ్లపైబడిన 8 వేల మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రగతిపై వివరిస్తున్నామన్నారు. ధర్మవరం, కదిరి, మడకశిర అర్బన్ ప్రాంతాల్లో తొలగింపు ఓట్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీసీలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రమేష్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తులశమ్మ రథోత్సవం



తులశమ్మ రథోత్సవంలో భక్తుల సందడి

లేపాక్షి: మండలంలోని గోపిందేవరపల్లిలో తులశమ్మ అమ్మవారి రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. రథోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రభాకర్, స్థానిక నాయకులు నాగరాజు, శ్రీనివాసులు, బాలు, తిప్పన్న, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అతిగా వాడితే అనర్థమే

- వైద్యుల సూచనల మేరకే యాంటీబయాటిక్స్
- జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి



ప్రపంచ యాంటీబయాటిక్ వారోత్సవాల్లో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి

పుట్టపర్తి రూరల్: చాలామంది తక్షణ ఉపశమనం కోసం యాంటీబయాటిక్స్ అతిగా వాడుతున్నారని, దీనివల్ల మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతుందని జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. వైద్యుల సూచన మేరకు తగిన మోతాదులోనే యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుందన్నారు. శనివారం పుట్టపర్తి పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... నిబంధనల మేరకే యాంటీబయాటిక్స్ ఉపయోగించాలన్నారు. వాటిని వాడే సమయంలోనూ చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. తద్వారా బ్యాక్టీరియా వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. మందుల షాపుల నిర్వాహకులు కూడా వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఉంటేనే యాంటిబయాటిక్స్ ఇవ్వాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆర్ఎంపీలు కూడా విచ్చల విడిగా యాంటీబయాటిక్స్ ఇస్తున్నట్లు తెలుస్తోందన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీసీహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్ మాట్లాడుతూ... యాంటీబయాటిక్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలు వివరించారు. ఓ రోగికి రాసిన మందులను అదే జబ్బుతో బాధపడే మరొకరు అస్సలు వాడకూడదన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి యాంటీబయాటిక్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీఐఓ కృష్ణయ్య, డాక్టర్ నాగరాజు నాయక్, కోఆర్డినేటర్ త్రిలోక్, ఏఎంఓ లక్ష్మణ్ నాయక్, సీహెచ్ఓ నగేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రస్ట్ అండగా... కడుపు నిండుగా

- ఆరురోజులు కొనసాగిన మహా నారాయణసేవ
- 3.80 లక్షల మందికి అన్న ప్రసాదాల వితరణ





మహా నారాయణసేవ ద్వారా అన్నప్రసాదాలు అందుకుంటున్న భక్తులు, మెడికల్ క్యాంపులో రోగులకు సేవలు అందిస్తున్న దృశ్యం

ప్రశాంతినిలయం: సత్యసాయి బాబా 98వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా నారాయణ సేవ నిర్వహించారు. ఈ నెల 18న ప్రారంభమైన నారాయణ సేవ ఆరు రోజుల పాటు కొనసాగింది. దేశ విదేశాల నుంచి ప్రశాంతినిలయం చేరుకున్న భక్తులు నారాయణసేవ ద్వారా ఆకలి దప్పులు తీర్చుకున్నారు. మొత్తంగా 3.80 లక్షల మందికి అన్నప్రసాదాలు అందజేసినట్లు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వర్గాలు తెలిపాయి. వంటల తయారీలో 850 మంది, అన్నప్రసాదాల పంపిణీలో 3,200 మంది వలంటీర్లు సేవలందించారు.

12 వేల మందికి వైద్యసేవలు..

బాబా జయంత్యుత్సవాల సందర్భంగా ప్రశాంతి నిలయంలోని నార్త్ బిల్డింగ్ వద్ద సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ నేషనల్ మెడికల్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. ఈనెల 18 నుంచి శుక్రవారం వరకూ కొనసాగిన మెడికల్ క్యాంప్ ద్వారా వివిధ వైద్య విభాగాల పరిధిలో 12,680 మంది వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులను సైతం పంపిణీ చేశారు. శిబిరాల్లో 92 మంది స్పెషలిస్ట్ వైద్యులు సేవలందించారు.

ఎన్నికల్లో పోటీకి కందికుంట అనర్హుడు

- ఆయన బ్యాంకు డీడీల దొంగ
- ప్రజలు వరుసగా ఓడిస్తున్నా సిగ్గు రాలేదు
- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి: 'నకిలీ డీడీల కేసులో కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్‌కు ఓ కేసులో ఏడేళ్లు, మరో కేసులో ఐదేళ్లు శిక్ష పడింది. కేసు పూర్తయ్యే వరకూ వార్డు మెంబర్‌గా కూడా పోటీ చేయను అని ఆయనే స్వయంగా సుప్రీం కోర్టుకు తెలియజేశాడు. అందుకే ఆయన 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హుడు కాదు' అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ప్రణీత్‌రెడ్డి కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. కదిరి ప్రజలు కందికుంటను పదే పదే ఓడిస్తున్నా ఆయనలో ఏమాత్రం మార్పు రాలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే కాకుండా ఇప్పుడు కూడా ఆయన అధికారులను బెదిరిస్తున్నాడని చెప్పారు. అధికారుల జోలికొస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు.

టిడ్కో వెనుక దోపిడీ..

కేంద్ర ప్రభుత్వ నిధులతో కట్టిస్తున్న టిడ్కో ఇళ్ల వద్ద కందికుంట సెల్ఫీ దిగి ఇవి మేమే కట్టిస్తున్నామని గొప్పలు చెప్పారని .. అయితే దాని వెనుక దోపిడీ కూడా చెబితే సంతోషిస్తామని ఎమ్మెల్యే సిద్దారెడ్డి అన్నారు. అక్కడ ఇల్లు తీసుకున్న లబ్ధిదారుడు నెలకు రూ.4వేలు చొప్పున 25 నెలలు చెల్లించాలని చంద్రబాబు అప్పట్లో పెట్టిన షరతును ఎమ్మెల్యే గుర్తు చేశారు. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే ముందుకెళ్తోందన్నారు. కందికుంట కబ్జా చేసిన క్రిస్టియన్, ముస్లిం, మైనార్టీల స్థలాల వద్ద సెల్ఫీ దిగి 'ఇది నేను కబ్జా చేశానోచ్..'అంటూ గొప్పలు చెబుతూ సెల్ఫీ దిగితే బాగుంటుందని హితవు పలికారు. రూ.2.30 కోట్లతో తాము కదిరి బైపాస్‌రోడ్డు నిర్మిస్తుంటే దాన్ని కూడా టీడీపీ హయాంలోనే తెచ్చామని కందికుంట తప్పుడు కాగితాలు చూపెడుతున్నారని తెలిపారు. అది ఎవరి హయాంలో వచ్చిందో.. దాని కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసింది ఎవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. టీడీపీ హయాంలో నిధులు వస్తే అభివృద్ధి పనులు ఎందుకు చేయలేదు? బేరం కుదరక ఆపేశారా? అని ప్రశ్నించారు.

అభివృద్ధి చేశాం.. ధైర్యంగా ఓట్లు అడుగుతాం

జగనన్న ప్రభుత్వ హయాంలో తాము కదిరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాం.. వచ్చే ఎన్నికల్లో ధైర్యంగా ప్రజల ముందుకెళ్లి ఓటు అడుగుతామని ఎమ్మెల్యే సిద్దారెడ్డి స్పష్టం చేశారు. ఒక్కో సచివాలయ పరిధిలో రూ.25 కోట్ల దాకా నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం రూ.2 వేల కోట్లకు పైగా సంక్షేమం ద్వారా ప్రజలకు అందజేస్తున్నామని చెప్పారు. అలాగే ఒక్కో సచివాలయ పరిధిలో అభివృద్ధి కోసం రూ.5 కోట్లు దాకా కదిరి నియోజకవర్గంలో నిధులు ఖర్చు చేశామన్నారు. కదిరి పట్టణ పరిధిలో మూడు లే అవుట్లలో 4 వేల మందికి పైగా జగనన్న ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. అభివృద్ధిపై మాట్లాడే హక్కు తమకే ఉందని, ఇప్పటికైనా కందికుంట సొల్లు కబుర్లు ఆపితే ప్రజలు ఆయనను క్షమిస్తారని, లేదంటే ప్రజలు ఆయనను ఇక్కడి నుంచి తరిమి కొట్టే రోజులు ఇంకెంతో దూరం లేవన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కొలిమి జిలాన్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు నూరుల్లా, కౌన్సిలర్లు రంగారెడ్డి, మహమ్మద్, ఆవుల స్వామి, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం


మాట్లాడుతున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: జిల్లా పరిధిలోని ప్రజలు ప్రజారవాణాకు సంబంధించి సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు డీపీటీఓ కార్యాలయంలో డయల్ యువర్ డీపీటీఓ (ఆర్‌ఎం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీపీటీఓ మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం డీపీటీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమం పై చర్చించారు. శనివారం (నేడు) ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు ప్రజారవాణాకు సంబంధించి సలహాలు, సూచనలు తెలియజేయవచ్చన్నారు. సెల్: 9959225662కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫార్మా డీ ఫలితాల విడుదల


జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో సెప్టెంబర్, అక్టోబర్ , నవంబర్ నెలల్లో నిర్వహించిన ఫార్మా డీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి. చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్మా డీ. రెండో సంవత్సరం (ఆర్–17) , రెగ్యులర్ , సప్లిమెంటరీ, ఫార్మా డీ. రెండో సంవత్సరం (ఆర్–14) సప్లిమెంటరీ, ఫార్మా. డీ (పీబీ) రెండో సంవత్సరం (ఆర్–17) రెగ్యులర్, సప్లిమెంటరీ , బీ ఫార్మసీ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19) రెగ్యులర్, సప్లిమెంటరీ, ప్రీపీహెచ్‌డీ (ఆర్–9), (ఆర్–18) సమ్మర్ సెషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు. పరీక్ష ఫలితాలు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

ఎస్కేయూలో భారీగా పదోన్నతులు


పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బోధనేతర సంఘం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఆనందరాజు , నాగమ్మ, ఎం.శంకర్, బండారు వెంకట్రాముడు సూపరింటెండెంట్ నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి దక్కింది.
- మద్దిలేటి, ఎస్. నాగభూషణం అసిస్టెంట్ రిజిస్ట్రార్ నుంచి డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్నతి దక్కింది.
- సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్‌గా 14 మందికి పదోన్నతులు దక్కాయి. వారిలో జి. వెంకటరాముడు, ఎస్. మారుతి, బి.శ్రీలత, ఏ. శివ ప్రసాద్, వి. గోవింద రెడ్డి, బి. ఈశ్వరయ్య, ఆర్. ఉమా శంకర్, ఎం. శ్రీనివాసులు, పి. శ్రీనివాసులు, ఎస్. చంద్రమ్మ, వీవీ సుబ్రమణ్యం, కె.పవన్ కుమార్, బి. నాగసుధ, షేక్ మహమ్మద్ ఇలియాజ్ ఉన్నారు.
- క్యాంపస్‌లో వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న 17 మంది సీనియర్, జూనియర్ అసిస్టెంట్, టైం, మినిమం స్కేల్, కన్సాలిడేటెడ్ పే ఉద్యోగులు 28 మందిని శుక్రవారం బదిలీ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు రమేష్

యల్లనూరు: విద్యుదాఘాతంతో కౌలు రైతు రమేష్ (29) మృత్యువాతపడిన ఘటన యల్లనూరు మండలం గొడ్డుమర్రిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... గొడ్డుమర్రికి చెందిన వెంకటకృష్ణారెడ్డి మూడెకరాల పొలంలో దానిమ్మచెట్లను సాగుచేస్తున్నారు. ఈ పొలాన్ని ఐదు సంవత్సరాలుగా కప్పల రమేష్ కౌలు చేసుకుంటున్నాడు. శుక్రవారం దానిమ్మ చెట్లకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి మోటారు ఆన్ చేసేందుకు వెళ్లాడు. మోటారు వైర్లను కరెంటు స్తంభానికి తగిలిస్తుండగా ఒక వైరు జారి పడి రమేష్ ఛాతిపై పడింది. అక్కడికక్కడే విద్యుదాఘాతంతో మృతి చెందారు. భార్య సాత్విక, కుమారులు ఆకాష్, రణదీప్, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మిర్చి రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి

హిందూపురం అర్బన్: రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్, వ్యవసాయ మార్కెట్, కిరికెర పట్టు పరిశోధనా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పట్టుగూళ్ల మార్కెట్‌లో క్రయ విక్రయాల తీరు పరిశీలించారు. పట్టు గూళ్ల ధరలు బాగున్నాయని.. అయితే రైతులకు, రీలర్లకు ప్రోత్సాహక మొత్తం రావాల్సి ఉందని, దాన్ని వచ్చేలా చూడాలని రీలర్లు, రైతులు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రోత్సాహక మొత్తం రైతులకు త్వరితగతిన అందేలా చూస్తామన్నారు. అక్కడి నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చేరుకొని మిర్చి వేలం పాటలను ప్రత్యక్షంగా చూసి రైతులతో మాట్లాడారు. అలాగే శీతల గిడ్డంగుల నిర్వాహకులు, చింత పండు వ్యాపారులతో మాట్లాడారు. అక్కడి నుంచి వ్యవసాయ కార్యాలయానికి చేరుకొని డివిజన్ స్థాయిలో పంటల పరిస్థితి, కరవు ఈ క్రాప్ బుకింగ్, ఆర్‌బీకే భవనాల నిర్మాణాల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. కిరికెర పట్టు పరిశోధనా కేంద్రంలో రాయలసీమ జిల్లాలకు చెందిన ఎస్వీలు, ఎస్వోలు శిక్షణా కార్యక్రమ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టు పరిశ్రమశాఖ ఏడీ సురేష్, పట్టు పరిశోధనా కేంద్రం డైరెక్టర్ సీతారాములు, వ్యవసాయశాఖ ఏడీ అల్తాఫ్‌ఖాన్, మార్కెట్ కార్యదర్శి సురేష్, పట్టుగూళ్ల మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

- 3.5 కేజీల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: అనంత కేంద్రంగా గంజాయి వ్యాపారం చేస్తున్న ముగ్గురిని అనంత పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సీఐ రెడ్డెప్పతో కలసి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నిందితుల వివరాలను వెల్లడించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని భవానీ నగర్‌కు చెందిన షేక్ సోనూ, ఆత్మకూరు మండలం వేపచెర్ల తండాకు చెందిన దొంగావత్ శివశంకరనాయక్ (ప్రస్తుతం ఇతను అరవిందనగర్‌లో నివాసం ఉంటున్నాడు), గుత్తికి చెందిన పీరం గణేష్ నిందితులు. ఈ ముగ్గురిలో షేక్ సోనూ ప్రధాన నిందితురాలు. ఈమెకు రాయచోటికి చెందిన బాబ్జీతో వివాహం కాగా నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో భర్త చనిపోయాడు. అప్పటి నుంచి పుట్టింట్లో ఉంటూనే ఇళ్ల పని చేస్తూ జీవనం సాగించేది. ఈక్రమంలో 8 నెలల కిందట ఆమె తమ్ముడు షేక్ బాబా ఫకృద్దీన్ అలియాస్ బబ్లూ గతంలో గంజా వ్యాపారం చేస్తూ గిద్దలూరు పోలీసులకు పట్టుబడి జైలుకు కూడా వెళ్లొచ్చాడు. అప్పటి నుంచే షేక్ సోనూ కుటుంబ పోషణకు, సులభంగా డబ్బు సంపాదించవచ్చని రైలులో కాకినాడ జిల్లా తునికి వెళ్లి అక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చేది. నగరానికి చెందిన పఠాన్ జాఫర్‌ఖాన్‌తో కలిసి తన ఇంటి వద్దనే చిన్న పాకెట్ లుగా కట్టి కిలో రూ.15 వేల నుంచి రూ.20 వేలకు అమ్ముతోంది. ఈ క్రమంలో గంజాయి కొనేందుకు ఆమె తుని వచ్చినప్పుడు గంజాయి వ్యాపారం చేసే గుత్తి మండలం పీ. కొత్తపల్లికి చెందిన ముంబై నరేష్, అనంతపురంకు చెందిన పవన్‌కుమార్ పరిచయమయ్యారు. నరేష్.. గుత్తికి చెందిన పీరం గణేష్‌తో పాటు మరికొందరికి గంజాయి అమ్మేవాడు. అప్పుడప్పుడు శివశంకర్‌నాయక్‌కు, పీరం గణేశ్ కుమార్‌కు కూడా గంజాయి సరఫరా చేసేది. శివశంకర్ నాయక్ నగరానికి చెందిన పవన్ కుమార్‌తో గంజాయి కొని అమ్మేవాడు. ప్రస్తుతం పవన్ కుమార్ జైలులో ఉన్నాడు. అతడు చెప్పిన వివరాల మేరకు అప్పుడప్పుడు షేక్ సోనూతో గంజాయి కొనేవాడు. ఈ క్రమములో షేక్ సోనూ తుని నుంచి తెచ్చిన గంజాయిని శివశంకర్ నాయక్, బోయ నరేశ్‌కు అమ్ముతుండగా గుత్తి రోడ్డులోని మిర్చి యార్డ్ సర్కిల్ వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకొని 3.5 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

27న చెన్నేకొత్తపల్లిలో 'రెడ్ల వనభోజనం'

రాప్తాడురూరల్: కార్తీక శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 27న సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని చెన్నేకొత్తపల్లి మండలం కనుమ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రెడ్డి కులస్తుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున 'రెడ్ల వనభోజనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి వేలాదిమంది రెడ్డి కుటుంబ సభ్యులు హాజరయ్యేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వనభోజనం సందర్భంగా స్వామివారికి కార్తీక దామోదర హోమం, రాజ్యశ్యామల హోమం, లక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నారు. చెన్నేకొత్తపల్లి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు ముద్రించి రెడ్డి కులస్తులకు ఆహ్వానం పలుకుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉండే రెడ్డి కులస్తులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని రెడ్డి సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

మూడిళ్లలో చోరీ

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో గురువారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఏకంగా మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. బత్తలపల్లి పోలీసుల వివరాలమేరకు... బత్తలపల్లి ఎస్సీ కాలనీలో మాతంగి శంకర్ ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆ ఇంట్లోకి దొంగలు ప్రవేశించి ఒక జత కమ్మలు, చిన్న ఉంగరాలు ఆరు, వెండి గొలుసు ఒకటి, రెండు వెండి కడియాలు అపహరించారు. అలాగే బీసీ కాలనీలో ఆదినారాయణమ్మ ఇంట్లో మూడు జతలు కమ్మలు, వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత ఆదెమ్మ ఇంట్లోకి ప్రవేశించి చిన్న ఉంగరాలు మూడు, ఒక జత వెండి గొలుసులను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. రాత్రి సమయాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

కుందుర్పి: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మలయనూరులో చోటు చేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మలయనూరుకు చెందిన మాల తిప్పేస్వామి (47) మద్యానికి బానిసై రోజూ భార్య యల్లమ్మతో గొడవ పడేవాడన్నారు. శుక్రవారం ఉదయం తిప్పేస్వామి మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవ పడ్డాడన్నారు. అయితే డబ్బులు తన దగ్గరలేవని భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై గ్రామ శివార్లోని చెక్‌పోస్టు సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.

ఇద్దరు కాపర్ దొంగల అరెస్టు


దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

యాడికి: కాపర్ వైరును అపహరిస్తున్న ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వేములపాడు సమీపంలో అజూర్ సోలార్ ప్లాంట్‌లో ఇటీవల కాపర్ వైరు చోరీకి గురైందన్నారు. ఈ ఘటనపై నిర్వాహకులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ క్రమంలో శుక్రవారం మేములపాడు జాతీయ రహదారిలో ఉన్న మోడల్ స్కూల్‌వ ద్ద అనుమానాస్పదంగా తచ్చాడుచున్న కళ్యాణదుర్గంకు చెందిన గంగన్న (21), నాగన్న(60)ను అదుపులోకి తీసుకుకొని విచారించగా సోలార్ ప్లాంట్‌లో కాపర్ వైరును దొంగిలించినట్లు నిర్ధారణ అయిందన్నారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

ఘనంగా తులసీ ధాత్రీ కల్యాణం


తులసీ ధాత్రీ కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో తులసీ ధాత్రీ కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆలయ ముఖ మండపంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తులసీ ధాత్రీ కల్యాణాన్ని జరిపించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఇతర సిబ్బంది, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జనవాక్కు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. నేను పని చేస్తున్న కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు రూ.కోటికి పైగా నిధులను వెచ్చించి పాఠశాలను అభివృద్ధి చేశారు. కొత్త గదులు, వంట గది, మరుగుదొడ్లను నిర్మించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన డెస్కులు, తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అన్ని వసతులు ఉండటంతో అడ్మిషన్లు పెరిగాయి. విద్యను టెక్నాలజీతో అనుసంధానం చేసిన రాష్ట్రం దేశంలో ఎక్కడలేదు. కేవలం మన రాష్ట్రం మాత్రమే.

– రవీంద్రనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, గిరిజన ఉపాధ్యాయ సంఘం

ఖర్చు లేకుండా ధ్రువపత్రాలు



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో చాలా ఇబ్బంది పడ్డాము. అయితే ప్రస్తుతం ధ్రువీకరణ పత్రాలు 24 గంటల్లోనే అది కూడా పైసా ఖర్చు లేకుండా వలంటీరే ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో మా ఇంట్లో వాళ్లకు అవసరమైన కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు చాలా సులువుగా చేతికిచ్చారు. దీంతో కాపు నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం నుంచి రూ. 15 వేలు ఆర్థికసాయం పొందాను. జగన్‌ను ఎప్పటికీ మర్చిపోము.

– లక్ష్మీదేవి, ఓల్డ్ సీపీఐ కాలనీ, గుత్తి

పెట్టుబడి సాయంతో భరోసా



మాకు 4.5 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. అందులో ఎకరాలో మామిడి తోట సాగు చేశా. కుటుంబమంతా పూర్తిగా వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నాము. మిగిలిన పొలంలో వేరుశనగతో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నాము. రైతుకు వ్యవసాయం భారం కాకూడదన్నా ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఏటా పెట్టుబడి సాయం అందిస్తోంది. నాలుగేళ్లుగా సుమారు రూ. 54 వేలు పెట్టుబడి సాయం పొందాను. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాదిరిగానే ఇచ్చిన మాటను ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పేదలకు న్యాయం చేస్తున్నారు. రాబోవు రోజుల్లో మా మద్దతు ఆయనకే ఇస్తాం.

– హనుమంతరాయప్ప, టీడీ పల్లి, రొళ్ల మండలం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఘటన స్థలం వద్ద ప్రమాదానికి గురైన ఆటో

డి హీరేహాళ్(రాయదుర్గం): బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారిపై డీ హీరేహాళ్ మండల కేంద్రం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో శుక్రవారం వేకువజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ ప్రకాష్ (28) అక్కడికక్కడే మృతి చెందగా బస్సులో ప్రయాణిస్తున్న మరో 30 మంది త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఎస్‌ఐ రంగడుయాదవ్ వివరాలమేరకు.. మృతుడు ప్రకాష్ టాటాఏస్ లగేజీ వాహనంలో రాంపురం నుంచి ఉల్లిగడ్డలు లోడ్ చేసుకుని బళ్లారి మార్కెట్‌కు తరలిస్తున్నాడన్నారు. బెంగళూరు నుంచి బళ్లారి వైపు ప్రయాణికులతో వస్తున్న ఎస్‌ఆర్‌జే ప్రైవేటు ట్రావెల్ బస్సు ఘటనా స్థలం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి టాటాఏస్ వాహనాన్ని ఢీ కొందని చెప్పారు. ప్రమాదంలో డ్రైవర్ ప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందగా బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు పేర్కొన్నారు.

విద్యా బోధన సులభతరంగా ఉండాలి


కూడేరు: మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వరప్రసాద్‌రావు

కూడేరు: విద్యలో వెనుకబడిన విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన చేసి వారిలో విద్యా సామర్థ్యాన్ని పెంపొందించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) వరప్రసాద్ రావు సూచించారు. కూడేరు హైస్కూల్‌లో కాంప్లెక్స్ స్థాయిలో 6, 7, 8 తరగతలకు గణితం సబ్జెక్ట్ బోధించే ఆత్మకూరు, కూడేరు, బెలుగుప్ప మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు లిప్ (లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం)పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. మీ బోధనే పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తాయని, కాబట్టి విద్యార్థులందరినీ దృష్టిలో పెట్టుకొని బోధన చేయాలన్నారు. తర్వాత భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోజూ ఎంత మంది హాజరవుతున్నారని ఐఈఆర్టీ మస్తానయ్యతో ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. కూడేరు హైస్కూల్‌లో నాడు–నేడు కింద నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. నిర్మాణపు పనులు నిదానంగా జరుగుతుండడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు.